## 204 వ అధ్యాయం

## ٢٠٤ - بَابُ اسْتِحْبَابِ جَعْلِ النَّوَافِلِ فِي الْبَيْتِ سَوَاءٌ الرَّاتِبَةُ وَغَيْرُهَا، وَالأَمْرِ بِالتَّحَوُّلِ لِلنَّافِلَةِ مِنْ مَوْضِعِ الفَرِيضَةِ أَوِ الفَصْلِ بَيْنَهُمَا بِكَلَامٍ

## ముఅక్కదాలైనా, గైర్ ముఅక్కదాలైనా నఫిల్ నమాజులను ఇంట్లో చేయడమే అభిలషణీయమైన పద్ధతి, ఫర్జ్ తర్వాత నఫిల్ కోసం స్థలం మార్చాలి, లేదా కనీసం మాటలతోనయినా వాటి మధ్య కాస్త వ్యవధినివ్వాలి

١١٢٩ - عَنْ زيدِ بنِ ثابتٍ رَضِيَ اللهُ عَنهُ، أَنَّ النَّبِيَّ ﷺ قالَ: «صَلُّوا أَيُّهَا النَّاسُ فِي بُيُوتِكُمْ؛ فَإِنَّ أَفضَلَ الصَّلاةِ صَلاةُ المَرْءِ فِي بَيْتِهِ إِلَّا المَكْتُوبَةَ» متفقٌ عليه.

1129. హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ప్రజలారా! మీరు మీ ఇండ్లల్లో (కూడా) నమాజ్ చేస్తూ ఉండండి. పురుషుని నమాజుల్లో ఇంట్లో చేసుకునే నమాజే అత్యుత్తమమైనది- ఒక్క ఫర్జ్ నమాజ్ తప్ప!

(బుఖారీ-ముస్లిం)

*(సహీహ్ బుఖారీలోని అజాన్ ప్రకరణం- సహీహ్ ముస్లింలోని ప్రయాణీకుల నమాజ్ ప్రకరణం)*

### ముఖ్యాంశాలు

ఫర్జ్ నమాజును మస్జిద్‌లో సామూహికంగా నెరవేర్చవలసి ఉంటుంది. ఇకపోతే మిగిలిన సున్నత్, నఫిల్ నమాజులను ఇంట్లో, మస్జిద్‌లో ఎక్కడైనా చేసుకోవచ్చు. అయితే వాటిని ఇంట్లో చేసుకోవటమే ఉత్తమం. పై హదీసులో సున్నత్, నఫిల్ నమాజులను ఇంట్లో చేసుకోవాలని ఆదేశించబడింది. నఫిల్ నమాజులను ఇంట్లో చేసే వ్యక్తి ప్రదర్శనా బుద్ధితోగాక చిత్తశుద్ధితో చేస్తాడు. అంతేకాదు, దానివల్ల ఇంట్లో శుభం కూడా అవతరిస్తుంది.

1130. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: మీ నమాజుల్లో కొన్నింటిని మీ ఇండ్ల కొరకు ప్రత్యేకించుకోండి. వాటిని (అనగా మీ ఇండ్లను) శ్మశానాలుగా చేసుకోకండి. (బుఖారీ-ముస్లిం)

١١٣٠ - وَعَنِ ابنِ عُمَرَ رَضِيَ اللهُ عَنهُمَا عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «اجْعَلُوا مِنْ صَلاتِكُمْ في بُيُوتِكُمْ، وَلا تَتَّخِذُوهَا قُبُوراً» متفقٌ عليه.

*(సహీహ్ బుఖారీలోని నమాజ్ ప్రకరణం- సహీహ్ ముస్లింలోని ప్రయాణీకుల నమాజ్ ప్రకరణం)*

**ముఖ్యాంశాలు:**

'కొన్నింటిని' అంటే నఫిల్ మరియు సున్నత్ నమాజులని భావం. ఇంట్లో నమాజ్ చేయకపోతే ఆ ఇల్లు శ్మశానంలా తయారవుతుంది. శ్మశానాల్లో ఆచరణ, ఆరాధనలు జరగవు. అలాగే ఇండ్లల్లో నమాజ్ చేయకపోతే ఆ ఇంటి మనుషుల్లో కూడా ఆచరణ, ఆరాధనా భావాలు సమసిపోతాయని ఈ హదీసు చూచాయగా హెచ్చరిస్తోంది.

1131. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: మీలో ఎవరయినా మస్జిద్‌లో నమాజ్ చేసుకుంటే అందులో కొంతభాగాన్ని తమ ఇంటి కొరకు కూడా ఉంచుకోవాలి. నిస్సందేహంగా అతని నమాజు మూలంగా దేవుడు అతని ఇంట్లో శుభాన్ని అవతరింపజేస్తాడు. (ముస్లిం)

١١٣١ - وَعَنْ جَابِرٍ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: قَالَ رسولُ اللهِ ﷺ: «إِذَا قَضَى أَحَدُكُمْ صَلاتَهُ في مَسْجِدِهِ؛ فَلْيَجْعَلْ لِبَيْتِهِ نَصِيباً مِنْ صَلاتِهِ؛ فَإِنَّ اللهَ جَاعِلٌ فِي بَيْتِهِ مِنْ صَلاتِهِ خَيْراً» رواه مسلم.

*(సహీహ్ ముస్లింలోని ప్రయాణీకుల నమాజ్ ప్రకరణం)*

1132. హజ్రత్ ఉమర్ బిన్ అతా కథనం: నాఫే బిన్ జుబైర్ గారు తన నమాజులో హజ్రత్ ముఆవియా (రజి) గారు చూసి (తనను మందలించి)న విషయం గురించి సాయిబ్ బిన్ ఉఖ్తె నమర్ (రజి)ని అడిగిరమ్మని నన్ను

١١٣٢ - وَعَنْ عُمَرَ بنِ عَطَاءٍ أَنَّ نَافِعَ بنَ جُبَيْرٍ أَرْسَلَهُ إلى السَّائِبِ ابْنِ أُخْتِ نَمِرٍ يَسْأَلُهُ عَنْ شَيْءٍ رَآهُ مِنْهُ مُعَاوِيَةُ فِي الصَّلاةِ فَقَالَ: نَعَمْ صَلَّيْتُ مَعَهُ الجُمُعَةَ في

المَقْصُورَةِ، فَلَمَّا سَلَّمَ الإِمَامُ، قُمْتُ في مَقَامِي، فَصَلَّيْتُ، فَلَمَّا دَخَلَ أَرْسَلَ إِلَيَّ فقال: لا تَعُدْ لِمَا فَعَلْتَ: إذا صَلَّيْتَ الجُمُعَةَ، فَلا تَصِلْهَا بِصَلاةٍ حَتَّى تَكَلَّمَ أَوْ تَخْرُجَ؛ فَإِنَّ رسولَ اللهِ ﷺ أَمَرَنَا بذلك، أَنْ لا نُوصِلَ صَلاةً بِصَلاةٍ حَتَّى نَتَكَلَّمَ أَوْ نَخْرُجَ. رواه مسلم.

పంపించారు. ఆ సందర్భంగా ఆయన ఇలా అన్నారు:

“ఔను..నేను ముఆవియాతో పాటు మక్సూరాలో నమాజ్ చేశాను. ఇమామ్ సలాం చేసి నమాజ్ ముగించిన తర్వాత నేను ఫర్జ్ చేసిన స్థలంలోనే నిలబడి (సున్నత్) నమాజ్ చేశాను. ఇంటికెళ్ళిన తర్వాత ముఆవియా గారు నన్ను తన వద్దకు పిలిపించి, ‘నువ్వు ఈ రోజు చేసినట్లు ఇంకెప్పుడూ చేయకు. జుమా నమాజ్ చేసిన తర్వాత ఎవరితోనయినా మాట్లాడనంత వరకు, అక్కడి నుండి కదలనంత వరకు (అంటే స్థలం మార్చుకోనంత వరకు) ఏ ఇతర నమాజూ చేయకు. ఎందుకంటే మనం ఒక నమాజు చేసిన తర్వాత మాట్లాడనంత వరకు లేదా అక్కడి నుండి వెడలనంతవరకు వేరొక నమాజును దాంతో కలపకూడదని దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞాపించారు’ అని చెప్పారు.” (ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని జుమా ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

‘మక్సూరహ్’ అంటే మస్జిద్ మూలలో తయారు చేయబడిన ఓ చిన్న కుటీరం లాంటిది. ఆ రోజుల్లో రాజులు, అధికారులు తమ రక్షణ నిమిత్తం అలాంటి కుటీరాలు నిర్మించుకునేవారు. వాటిలోనుంచే ప్రజలతోపాటు సామూహికంగా నమాజ్ చేసేవారు. హదీసులో పేర్కొనబడిన సంఘటన జుమా నమాజుకు సంబంధించినది కాబట్టి ముఆవియా (రజి)గారు ప్రత్యేకంగా జుమా గురించే ప్రస్తావించారు. వాస్తవానికి ప్రతి ఫర్జ్ నమాజు అనంతరం అదే పద్ధతిని అవలంబించాలి. మాట్లాడటం ద్వారాగాని, స్థలం మార్చిగాని, మస్జిద్ నుండి బయటికి లేక ఇంటికి వెళ్ళటం ద్వారాగాని ఫర్జ్ నఫిల్ నమాజుల మధ్య వ్యవధినివ్వాలి.